

మాట్లాడుతున్న బీఆర్ఎస్వై మండలాధ్యక్షుడు ఆడప శ్రీనివాస్

# నియోజకవర్గ అభివృద్ధిపై 'కవ్వంపల్లి'కి ధ్యాసేది?

- ఆయన అనుచరుడి ఆగడాలపై స్పందించకపోవడం దేనికి సంకేతం
- అక్రమ వసూళ్లలో ఎమ్మెల్యేకు వాటా వంద శాతం వాస్తవం
- జీవీఆర్‌పై ఆరోపణలు సహించం
- బీఆర్ఎస్వై మండలాధ్యక్షుడు ఆడప శ్రీనివాస్

మానకొండూర్, మే 31: నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఏమాత్రం ధ్యాస లేదని బీఆర్ఎస్వై మండలాధ్యక్షుడు ఆడప శ్రీనివాస్ విమర్శించారు. ఆయన అనుచరుడు దళిత యువకుడిని డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడిన ఆడియో ఇటీవల వైరల్ అయినా ఎమ్మెల్యే స్పందించకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఆర్ ట్యాక్స్, యూ ట్యాక్స్ మొదలవగా, మానకొండూర్ నియోజకవర్గంలో కే ట్యాక్స్ (కవ్వంపల్లి) నడుస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు నూటికి నూరు శాతం వాస్తవమేనని పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆడప శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ మండల నాయకులు జీవీఆర్‌పై చేసిన ఆరోపణలను ఖండించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని వారికి హితవు పలికారు. అక్రమ వసూళ్లలో కవ్వంపల్లికి వాటా ఉన్నది కాబట్టే ఆడియోపై ఆయన స్పందించడం లేదని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మార్చే నైజం కవ్వంపల్లిదని ఎద్దేవా చేశారు. సుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు జీవీఆర్ మానకొండూర్‌కు ఏమి చేశారని అడిగే కాంగ్రెస్ నాయకులు, కళ్లు తెరిచి చూస్తే ఆయన చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీపై, నాయకులపై ఆరోపణలకు దిగితే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఎమ్మెల్యేలు, నాయకులను గ్రామాల్లో తిరగనీయమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల ఉపాధ్యక్షుడు కనుకుంట్ల అభిలాష్, యూత్ నాయకులు దండబోయిన శేఖర్, సాయవేణి రాజు, పురం అనిల్, పిట్టల శ్రీనివాస్, పిండి సందీప్, బూమరాజు శ్రీనివాస్, కల్వల ప్రవీణ్, బోడ రాజశేఖర్, వన్నారం రమేశ్, కర్న రాజేందర్, పాదం సందీప్, రాపాక మధు, రమేశ్, సురేందర్, రాకేశ్, రాజు, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో లారీ బీభత్సం

తిమ్మాపూర్, మే 31: గొల్లపల్లి గ్రామంలో ఓ లారీ బీభత్సం సృష్టించింది. రేణికుంట టోల్ ప్లాజా టోల్ రుసుము తప్పించుకునేందుకు గొల్లపల్లి మీదుగా గుండ్లపల్లికి లారీలు వెళ్తుంటాయి. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో గొల్లపల్లి మీదుగా వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో పోల్ విరిగిపోయి వైర్లు తెగి పడిపోయాయి. దీంతో గ్రామంలో రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రమాద సమయంలో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని, లారీలో తొమ్మిది మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. విద్యుత్ వైర్లు తెగి లారీపై పడితే పెను ప్రమాదం సంభవించేదని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో పదుల సంఖ్యలో టీవీలు, ఫ్రిడ్జ్‌లు కాలిపోయాయని.. టోల్ రుసుము తప్పించుకోవడానికి ఇటువైపు వచ్చే లారీలను కట్టడి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. డ్రైవర్ తప్పించుకోగా, పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించారు.

# రైతులు ఒకేరకం విత్తనంపై ఆధారపడొద్దు

- విభిన్న రకాల కంపెనీల పత్తి విత్తనాలను వాడాలి
- లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి
- కరీంనగర్‌లో విత్తనాలు, పురుగుమందుల దుకాణాల తనిఖీ

కరీంనగర్, మే 31 (నమస్తే తెలంగాణ): రైతులు విభిన్న రకాల కంపెనీల పత్తి విత్తనాలను సాగుకు వాడాలని, ఒకే రకంపై ఆధారపడవద్దని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం నగరంలోని గాంధీరోడ్‌లో వైష్ణవి, మార్కెట్ రోడ్‌లో రెడ్డి విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తి విత్తనాల విక్రయాలపై దుకాణా యజమానుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఏ రకం పత్తి విత్తనాలను రైతులు అధికంగా కొంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎందుకు ఒకే విధమైన పత్తి విత్తనాన్ని కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. ప్రొఫార్మా ప్రకారం రైతుల వివరాలు నమోదు చేస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. రెడ్డి ఏజెన్సీలో పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతుతో వ్యవసాయ అధికారితో ఫోన్‌లో మాట్లాడించి వివరాలు తెలుసుకున్నారు. రైతుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. పత్తి విత్తనాల ప్యాకెట్లను స్వయంగా పరిశీలించారు. వాటికి సంబంధించిన ధర, వెయిట్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గోదాముల్లో నిల్వ ఉంచిన పత్తి, వరి విత్తనాల బ్యాగులను పరిశీలించారు. అనంతరం



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

కలెక్టర్ మాట్లాడుతూ, పత్తి విత్తనాలను నిబంధనలను ప్రకారం విక్రయించాలని సూచించారు. రైతులు ఒకే రకమైన పత్తి విత్తనాన్ని ఎక్కువగా వాడవద్దని, విభిన్న రకాలను పంటల సాగులో వాడాలని పేర్కొన్నారు. విత్తనాలు, పురుగుమందుల కొరత రాకుండా ముందు జాగ్రత్తగా ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. వ్యాపారులు నిబంధనలను పాటించాలని, లైసెన్సులను గడువు దాటక ముందే రెన్యువల్ చేసుకోవాలని ఆదేశించారు. రైతులు లైసెన్సులు కలిగిన వ్యాపారుల వద్దే విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసే సమయంలో రసీదులు తప్పకుండా తీసుకుని భద్రపరుచుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత వ్యాపారులు, వ్యవసాయ అధికారులపై ఉందని చెప్పారు. రైతులు లైసెన్సులు లేని వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్, కరీంనగర్ ఏడీఏ రణధీర్ రెడ్డి, అర్బన్ వ్యవసాయ అధికారి హరిత, తదితరులు పాల్గొన్నారు.

## పండుగలా 'బడిబాట' నిర్వహించాలి

మానకొండూర్ రూరల్, మే 31: బడిబాట కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో పండుగలా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మానకొండూర్ మండలంలోని ముంజంపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. జూన్ 4లోగా ఏ ఒక్క పనీ మిగిలిపోకుండా చూడాలని పేర్కొన్నారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులు, అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువు పూర్తయిన చిన్నారులను అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, ఎంపీడీవో నర్సయ్య, ఎంఈవో మధుసూదనాచారి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాములును సత్కరిస్తున్న టీఎన్జీవో నాయకులు, ఉద్యోగులు

కొత్తపల్లి, మే 31 : ఉద్యోగ విరమణ పొందిన పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాములును జిల్లా టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగం లక్ష్మణరావు.. జయరాములును శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉద్యోగులు, ప్రజల ఆదరాభిమానాలు పొందడం గొప్ప విషయమన్నారు. జయరాములు శేష జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ నరేందర్, అసిస్టెంట్ డైరెక్టర్ నల్ల లింగారెడ్డి, నాయకులు గూడ ప్రభాకర్‌రెడ్డి, జగన్‌గౌడ్, గిరిధర్‌రావు, హరిప్రియ, ప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, చల్ల మోహన్‌రెడ్డి, ఆజ్గర్, రాజు, అజయ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు ఉత్పత్తులతోనే అసంక్రమిత వ్యాధులు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత



నగరంలో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

విద్యానగర్, మే 31: పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, పాన్ మసాలా, గుట్కా, తంబాకు వాటితోనే అసంక్రమిక వ్యాధులైన క్యాన్సర్, రక్తపోటు, గుండె వ్యాధులు, డయాబెటిక్ లాంటివి వస్తున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో పొగాకు ఉత్పత్తుల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశంలో రోజుకు 3500 మంది పొగాకు తినడంతోనే మరణిస్తున్నారని, అనేక వ్యాధుల బారిన పడుతున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తి, ఉత్పత్తుల అమ్మకం నిషేధ చట్టం 2003 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడం నేరమని గుర్తు చేశారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు అమ్మకం నిషేధమని పేర్కొన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల వచ్చే వ్యాధుల గురించి జిల్లాలోని 128 విద్యాసంస్థలు, 148 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్లు, పాఠశాలల్లో పొగాకు వ్యతిరేక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవగాహన ర్యాలీలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, పీవోఎం డాక్టర్ జువేరియా, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ శిల్ప, ఎస్‌వో కాంతారావు, డెమో రంగారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో విత్తనాలు

ఇల్లందకుంట, మే 31 : మండలంలో రైతులకు అవసరం మేర విత్తనాలు షాపుల్లో అందుబాటులో ఉన్నాయని ఏవో గుర్రం రజిత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటి దాకా 200 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను రైతులకు విక్రయించినట్లు తెలిపారు. విత్తనాలు ఎక్కువ ధరలకు అమ్మితే క్రిమినల్ కేసు తప్పవని షాపుల యజమానులను హెచ్చరించారు.

## డీఈపై కార్పొరేటర్ ఫిర్యాదు

కార్పొరేషన్, మే 31: కరీంనగర్ నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలో పని చేసిన డీఈ మసూద్ చేపట్టిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కార్పొరేటర్ బండారి వేణు నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. డీఈ హోదాలో మసూద్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ముఖ్యంగా మార్కెట్ కమిటీ సమీపంలో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, రూ.5 కోట్లకు టెండర్లు పిలిస్తే అవి సరిపోవడం లేదని అంచనాలు పెంచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే బుట్టిరాజారం కాలనీలో చేపట్టిన పార్క్ అభివృద్ధి పనుల్లోనూ అక్రమాలకు పాల్పడ్డారని, నగరంలోని చౌరస్తాల సుందరీకరణ పనుల్లోనూ కాంట్రాక్టర్లకు అనుకూలంగా అంచనా రేట్లను పెంచి బిల్లులు చేశారని ఆరోపించారు. వీటితో పాటు తనకు ప్రజాప్రతినిధులతో ఉన్న సంబంధాలతో ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు, కిందిస్థాయి ఉద్యోగులను బెదిరింపులకు గురిచేశారని, గతంలోనూ ఈఈ స్థాయి అధికారులను ఏసీబీకి పట్టించి బెదిరించారని ఆరోపించారు. ఆయన చేపట్టిన స్మార్ట్‌సిటీ పనులు, ఇతర అభివృద్ధి పనులపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని కోరారు.

## గడువులోగా దుస్తులు అప్పగించాలి

వీణవంక, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం సిద్ధం చేస్తున్న యూనిఫామ్స్ ఈ నెల 5లోగా ఆయా మండలాల విద్యాధికారులకు అప్పగించాలని డీఆర్డీవో శ్రీధర్ మహిళా స్వశక్తి సంఘ సభ్యులకు సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల కోసం సంఘం సభ్యులు స్టిచ్చింగ్ చేస్తున్న యూనిఫామ్స్‌ను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, ఐకేపీ ఏపీఎం కొమురయ్య, సీసీలు ఆనంద్, తిరుపతి, ఘనశ్యామ్, శ్రీకాంత్, మహిళా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, మే 31: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవనంలో ఈ నెల 10న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'ఉపాధి హామీ చట్టం అమలు-సవాళ్లు' అంశంపై నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు పిలుపునిచ్చారు. నగరంలోని సీపీఎం కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అజయ్, నాయకులు సంపత్, భూమయ్య పాల్గొన్నారు.

## 'రైతు భరోసా' విడుదల చేయాలి

కలెక్టరేట్, మే 31 : రైతు భరోసా పథకం కింద అందజేయనున్న పెట్టుబడి సాయం ఈ నెలలోనే రైతుల ఖాతాల్లో జమచేయాలని తెలంగాణ కిసాన్ సంఘ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చల్లగొండ ముత్యంరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని హన్మాన్‌నగర్‌లో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో టీకేఎస్ జిల్లా ప్రతినిధులు దర్శనం మహేశ్, రాగడి వెంకటేశం, పసునూరి రాజు, ఉల్లెంగల రాములు, జోగినపల్లి శ్రీనివాసరావు, హన్మంతరావు, మిట్టపల్లి రాజారెడ్డితో పాటు జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## పత్తి విత్తనాల తనిఖీ: శాంపిల్స్ సేకరణ

కరీంనగర్ రూరల్, మే 31: మండలంలోని బొమ్మకల్ గ్రామంలో హోల్‌సెల్ డిస్ట్రిబ్యూటర్ల నుంచి శాంపిల్స్‌ను మండల వ్యవసాయ అధికారి బీ సత్యం సేకరించారు. హన్మాన్ ఆగ్రోస్‌లో శ్రీరామ బయోసీడ్స్ కంపెనీకి చెందిన జీహెచ్‌హెచ్ 029, వసంత్ సీడ్ కంపెనీ, ముద్రవిత్తనాలు, వానా శ్రీ అగ్రి సర్వీసెస్‌లో అజిత్ సీడ్స్ కంపెనీ -ఏసీహెచ్ 900-2, మహికో- ఎంఆర్‌సీ -737 పత్తి విత్తనాల ప్యాకెట్స్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా కంపెనీల పత్తి విత్తనాల శాంపిల్స్‌ను సేకరించారు. వాటిని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. ల్యాబ్ నుంచి పరీక్షా ఫలితాలు వచ్చిన తర్వాతే ఆయా కంపెనీల పత్తి విత్తనాలను డీలర్లకు సరఫరా చేయాలని ఆయా సంస్థల యజమానులకు సూచించారు.

## గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం

చిగురుమామిడి, మే 31: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్ కొనియాడారు. ముదిమాణిక్యం పంచాయతీ కార్యదర్శి ఇషా ఖాన్ ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఇషా ఖాన్ దంపతులను ముఖ్య అతిథులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్, తహసీల్దార్ నరేందర్, సూపరింటెండెంట్ ఖాజా మొయినుద్దీన్, ఎంపీవో శ్రవణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం మండలాధ్యక్షుడు ఇనుగాల వెంకటరమణారెడ్డితో పాటు అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

***ప్రజాప్రతినిధులు రాకపోవడం బాధాకరం***

గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీలతోపాటు తాజా మాజీ సర్పంచులు ఆహ్వానం అందజేసినప్పటికీ రాకపోవడం బాధాకరమని పంచాయతీ కార్యదర్శుల ఫోరం మండలాధ్యక్షుడు ఇనుగాల వెంకటరమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉద్యోగ విరమణ పొందే పంచాయతీ కార్యదర్శులకు ప్రజాప్రతినిధులతో ఉన్న సత్సంబంధాలు చిరస్థాయిగా గుర్తుండి పోయేలా హుందాగా వ్యవహరించాలని సూచించారు.

## అభిమాని కుటుంబానికి ఆర్థిక సాయం

కమాన్‌చౌరస్తా, మే 31 : సినీ హీరో చిరంజీవి అభిమాని కుటుంబానికి బీఎస్ఎస్ఎఫ్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఆర్థిక సాయం అందజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన చిరంజీవి అభిమాని కిరణ్ కుమార్ గతేడాది అనారోగ్యంతో మృతిచెందగా, పేద కుటుంబానికి చెందిన ఆయన ఇద్దరు కూతుళ్లకు పదో తరగతి వరకు విద్యాభ్యాసం కోసం ఆర్థిక సాయం అందించేందుకు బీఎస్ఎస్ఎఫ్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ ముందుకు వచ్చారు. ఈ సంవత్సరం కూడా రూ. 20 వేల విలువైన చెక్కును రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షుడు వేల్పుల వెంకటేశ్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి రమేశ్, గట్టు నారాయణ గౌడ్, బండవరపు సుమన్, కోటసిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండకు తాళ లేక వృద్ధురాలి మృతి

వీణవంక, మే 31: మండల కేంద్రానికి చెందిన కళ్యాణం రామక్క (75) ఎండ తీవ్రత తట్టుకోలేక మృతిచెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతను తట్టుకోలేక రామక్క ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తన గుడిసెలోనే ఉంటున్నది. శుక్రవారం సాయంత్రం ఎంతకూ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు లోనికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందింది.

## 'బ్లూబెల్స్'లో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

కమాన్‌చౌరస్తా, మే 31 : హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలలో వాసవీ వనితా క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిన్మయ వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. పది రోజులుగా 50 మంది పిల్లలకు భగవద్గీత శ్లోకాలు, రామాయణానికి సంబంధించి క్విజ్ గేమ్స్, ల్యూసిడ హ్యాండ్ రైటింగ్, వేద గణితం నేర్పించగా, ఆఖరు రోజు చిన్మయ మిషన్ ఆచార్యులు అక్షయ చైతన్య సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జంగ సునీతా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ వేసవి శిక్షణ శిబిరం ద్వారా పిల్లలు రామాయణం, భగవద్గీత శ్లోకాలు నేర్చుకున్నారని, వీటి ద్వారా చిన్నారులకు నైతిక విలువలు తెలుస్తాయని చెప్పారు. ఇక్కడ వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి, సెక్రటరీ మధుకర్, ఐపీసీ చందా రవీందర్, చందా విజయలక్ష్మి, సెక్రటరీ నూనె పద్మావతి, కోశాధికారి అనురాధ ఉన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులతో శిబిరం నిర్వాహకులు

## అంజన్న భక్తులకు అల్పాహారం వితరణ



భక్తులకు అరటిపండ్లు అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

కొత్తపల్లి, మే 31 : కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లే హనుమాన్ భక్తులకు జై హనుమాన్ సేవా సమితి కొత్తపల్లి(హెచ్) ఆధ్వర్యంలో అల్పాహారం వితరణ కార్యక్రమం చేపట్టారు. కొత్తపల్లిలో ఈ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. అల్పాహారంలో అరటిపండు, బాదంపాలు, శెనగ గుడాలు, మజ్జిగ ప్యాకెట్స్ ఇస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఏడేండ్ల నుంచి ఏటా భక్తులకు అల్పాహారం అందిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. నిత్యం వందల మంది హనుమాన్ భక్తులకు అల్పాహారం సమకూరుస్తున్నామని పేర్కొన్నారు.

## ఉపాధి కార్మికుల వేతనాలు సక్రమంగా చెల్లించాలి

కలెక్టరేట్, మే 31: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కార్మికులకు వేతనాలు సక్రమంగా విడుదల చేయాలని ఉపాధి కార్మికుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని తిరుమలనగర్‌లో గల సంఘ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలు సంఘాల ప్రతినిధులు వాసుదేవ్, రెహమాన్, జాగీర్ శ్రీను మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించేందుకు ప్రారంభించిన ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రంలోని పాలకులు కార్పొరేట్ విధానాన్ని విడనాడి, పేదల అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపాలని హితవు పలికారు. సమావేశంలో ఉపాధి కూలీల సంక్షేమ సంఘం నాయకులు రావుల కిషన్, అన్నెబోయిన అరుణ్‌కుమార్, తేజావత్ శ్యామ్‌కుమార్, వెర్సి, రఘురాములు, రుద్ర కిశోర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలి

హుజూరాబాద్ రూరల్, మే 31: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకటి, రెండో తేదీల్లో హైదరాబాద్‌లో వివిధ కార్యక్రమాలు ఉంటాయని, మూడో తేదీన జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు జెండావిష్కరణ చేయాలని కోరారు.

## ప్రభుత్వ భూ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

చిగురుమామిడి, మే 31: మండల కేంద్రంలోని పాము బండ వద్ద సర్వే నంబర్ 840లో 3.12 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావడంపై చర్యలు తీసుకోవాలని ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ ఇప్ప నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ డీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల నరేశ్, మండల ప్రచార కమిటీ సభ్యులు జిల్లెల్ల సురేశ్, రమేశ్, నవీన్, నాగరాజు, సంతోష్, హరీశ్, నరేశ్ తదితరులున్నారు.


## పీవీ జిల్లాను వెంటనే ప్రకటించాలి

హుజూరాబాద్ రూరల్, మే 31: హుజూరాబాద్ కేంద్రంగా పీవీ జిల్లాను వెంటనే ప్రకటించాలని జిల్లా సాధన జేఏసీ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బీమోజు సదానందరం డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూరాబాద్ మున్సిపాల్ పార్కులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హుజూరాబాద్ కేంద్రంగా చుట్టుపక్కల ఉన్న 14 మండలాలను కలుపుకొని జిల్లాగా ప్రకటించే వరకు ప్రజలతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు వేల్పుల రత్నం, సైదాపూర్ మాజీ ఎంపీపీ పొడిసెట్టి వెంకట్రాజం, ఆలేటి రవీందర్, కొడిగూటి మొగిలయ్య, తాటిపల్లి రాజన్న, క్యాస రమేశ్, డాక్టర్ తడికమళ్ల శేఖర్, వేల్పుల ప్రభాకర్, రామ్ సారయ్య, ఇల్లందుల సమ్మయ్య, రామ్ రాజేశ్వర్, మార్త రవీందర్, బత్తుల రాజలింగం, సందెల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## 2న జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, మే 31: తెలంగాణ స్టేట్ సీనియర్, యూత్, అండ్ ఫస్ట్ టీఎస్ కిడ్స్ రన్స్ ఎంపిక పోటీల్లో పాల్గొనే కరీంనగర్ జిల్లా జట్టు ఎంపిక ఈ నెల 2న ఆదివారం స్థానిక అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 6 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మహిపాల్, రవి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 6 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని కోరారు. పోటీలు అండర్ 8,10,12,14,16,18,20 విభాగాల్లో బాల బాలికలకు, పురుషులు, స్త్రీలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## వాగేశ్వరిలో ఘనంగా వీడ్కోలు వేడుకలు



తిమ్మాపూర్: విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న వాగేశ్వరి కళాశాల సెక్రటరీ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి

తిమ్మాపూర్, మే 31: రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు థర్డ్ ఇయర్ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. వేడుకలను విద్యాసంస్థల కార్యదర్శి గంద్ర శ్రీనివాస్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులకు జీవిత పాఠాలను బోధించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో హోరెత్తించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హెచ్‌వోడీ వెంకటరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

***సింగాపూర్ కిట్స్‌లో..***

హుజూరాబాద్ రూరల్, మే 31: సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శంకర్, విద్యార్థులకు ఉన్నత విద్యకు సంబంధించి మార్గదర్శనం చేశారు. విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ రాజేశ్వరరావు, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రబాబు, అధ్యాపక సమన్వయకర్తలు ప్రదీప్, దీపక్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసులకు ముగిసిన స్పోర్ట్స్ మీట్

రాంనగర్, మే 31 : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పోలీసులకు నిర్వహించిన వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్ శుక్రవారం కమిషనరేట్ పరేడ్‌లో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్టీజోన్ ఐజీ-1 ఏవీ రంగనాథ్ హాజరయ్యారు. ఐజీకి కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకగా, పోలీస్ ఆర్మ్డ్ రిజర్వు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. తర్వాత జట్ల వారీగా స్పోర్ట్స్ పరేడ్ నిర్వహించారు. స్పోర్ట్స్ మీట్ లైట్ వెలిగించారు. రెండు రోజులపాటు జరిగిన క్రీడలను ఒక ఏవీ రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా మల్టీజోన్ ఐజీ- 1 రంగనాథ్ మాట్లాడారు. పోలీసులకు అతి తక్కువ సమయంలో చాలా గొప్పగా ఈ మీట్ నిర్వహించారని, సీపీని అభినందించారు. ఈ మీట్‌లో భాగంగా సిబ్బందికి అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్ బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, కబడ్డీతో పాటు మొత్తం 12 క్రీడల్లో పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు.

## బోధనేతర సిబ్బందికి ఈఎస్ఐ అమలు చేయాలి

తెలంగాణచౌక్, మే31: ప్రభుత్వామోదిత పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బందికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను యాజమాన్యాలు కల్పించాలని భారతీయ మజ్దూర్ సంఘ (బీఎంఎస్) జిల్లా అధ్యక్షుడు పసుల శ్రావణ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పని గంటలకు మించి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. విద్యాసంస్థలు నిర్లక్ష్యం చేస్తే బీఎంఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

## ఉద్యోగాలు భర్తీ చేయాలి

తెలంగాణచౌక్, మే 31: ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండలంలో శుక్రవారం డీవైఎఫ్ఐ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, దేశంలో, రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖలో ఉన్న ఉద్యోగాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, రాహుల్, అజయ్ పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలి

హుజూరాబాద్ రూరల్, మే 31: రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని హుజూరాబాద్ ఏడీఏ సునీత షాపుల యజమానులకు స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలో పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. అమ్మకాల్లో ఏదైనా తప్పు జరిగినట్లయితే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పత్తి, జీలుగ, ఇతర విత్తనాలు రైతుల అవసరం మేరకు డివిజన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆమె వెంట ఏవో సునీల్ కుమార్ ఉన్నారు.

## అధికారిక చిహ్నాన్ని మారిస్తే ఊరుకునేది లేదు

హుజూరాబాద్ రూరల్, మే 31: రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని మారిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ యూత్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి తొగరు శివకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర చిహ్నాన్ని మార్చడం అంటే తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసినట్లేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడితే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194